
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గరిష్ఠం 30.5
కనిష్ఠం 22.8
నల్లగొండ
5
ఆదివారం 12 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 590 (312.0450) | 1,00,729 | 1,00,729 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 644.30 (4.28) | 3,031.92 | 2,970.33 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 173.029 (42.7287) | 82,692 | 82,092 |

| చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220 |
|---|---|---|---|

# ఇంకెన్నాళ్లీ బతుకులు



- దరిచేరని నమస్తే పథకం
- పర్యావరణాన్ని పరిరక్షించడంలో పరోక్ష దోహదం
- వృత్తిగా మారిన చెత్త సేకరణ
- ఆ ఆదాయంతోనే కుటుంబాలను వెల్లదీసుకుంటున్న దీనస్థితి

ఎన్ని ప్రభుత్వాలు మారినా, రోడ్ల వెంట చెత్త సేకరించే కార్మికులు, సఫాయి కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదు. వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం 2023లో నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్) అనే పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అయితే ఈ పథకం కార్మికుల దరిచేరడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,రామగిరి)

నమస్తే పథకాన్ని కేంద్ర సామాజిక న్యాయం, అధికార పరిరక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ అమలు చేస్తోంది. 2023లో ప్రారంభమైనప్పటికీ 2026 నాటికి పూర్తిస్థాయిలో ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ప్రధానంగా రోడ్ల వెంట చెత్త ఏరుకునేవారికి, సెప్టిక్ ట్యాంకులను, మురుగు కాల్వలను శుభ్రపరిచే వారికి సురక్షితమైన యాంత్రిక పద్ధతులను ప్రోత్సహించడం, ఆయా కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి వారి జీవనోపాధిలో మెరుగుదల కల్పించడం ఈ పథకం లక్ష్యం. అయితే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినా, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారడంతో పాటు, రోడ్ల వెంట చెత్త ఏరుకునే కుటుంబాల పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండటం లేదు. దీంతో వారు రోజువారీగానే చెత్తను సేకరించి వచ్చే అరకొర ఆదాయంతో బతుకీడుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం లక్ష్యం వందశాతం అమలైతేనే వారి జీవన విధానంలో మార్పు రానుంది.

## నమస్తే పథకం ఇలా..

మురుగు నీరు, సెప్టిక్ ట్యాంకు కార్మికులు, రోడ్ల వెంట చెత్త ఏరుకునే వారిని గుర్తించి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా వర్తింపజేయాలి. మెరుగైన జీవనోపాధి కోసం కార్మికులకు ఆయా రంగాల్లో శిక్షణ ఇవ్వాలి. యాంత్రికమైన పరికరాలు అందించాలి. స్వయం సహాయక సంఘాల ద్వారా సబ్సిడీ రుణాలు అందించడం నమస్తే పథకం ప్రధాన ఉద్దేశం.

## పర్యావరణాన్ని పరిరక్షించడంలో ముందంజ

దిగువశ్రేణి కార్మికులు వారి బతుకులు వెల్లదీసుకునేందుకు ప్రధానంగా చెత్త ఏరుకునే వారు ప్రతీ రోజు తెల్లవారుజామునే పట్టణంలోని ప్రధాన రహదారులు, బహిరంగ స్థలాలు, వీధుల్లో తిరుగుతూ చెత్త సేకరిస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ సంచులు, పేపర్లు, ఇతర వస్తువులు సేకరిస్తూ ఆయా ప్రాంతాల్లో కాస్తో కూస్తో శుభ్రపరచడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడంలో పరోక్షంగా దోహదపడుతున్నారు. పొద్దస్తమానం సేకరించిన పాలిథిన్ కవర్లను, ప్లాస్టిక్, సీసాలను విక్రయించి రోజూ రూ.100 నుంచి రూ.150

- మిగతా 8వ పేజీలో...

# తుంగతుర్తికి నేడు సీఎం రేవంత్



దామోదర్‌రెడ్డి సంతాప సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ, సర్వోత్తమ్‌రెడ్డి

## మాజీ మంత్రి ఆర్డీఆర్ సంతాప సభకు హాజరు

తుంగతుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి రానున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఈ నెల ఒకటో తేదీన మృతి చెందగా, ఆయన సంతాప సభ మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సంతాప సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేయగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ నరసింహ పరిశీలించారు. ముఖ్యమంత్రి తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు సుమారు 50వేల నుంచి 60వేల మంది వరకు ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్డీవో వేణుమాధవ్, ఆర్డీఆర్ కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రైతు కమిషన్ రాష్ట్ర సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి, పోతు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఆర్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు అని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆయనవెంట కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, సునీల్ కుమార్, ఉన్నారు.

# పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

- అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటాం
- ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి

నల్లగొండ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడి ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామని ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి అన్నారు. డీసీసీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా, పార్టీ నాయకులు, కార్యకర్త మనోభావాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని డీసీసీ అధ్యక్షుడి నియామకం చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. డీసీసీ అధ్యక్షుడి నియామకం తర్వాతబ్లాక్, మండల, గ్రామస్థాయి అధ్యక్షుల ఎంపిక నిర్వహిస్తామన్నారు.జిల్లాలో 10 రోజులపాటు పర్యటించి అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనకు అనుగుణంగా, అంకితభావంతో పనిచేసే వారిని, అందరినీ సమన్వయపరిచి పార్టీని ముందుకు నడిపించే వ్యక్తిని ఎంపిక చేస్తామన్నారు. ఏఐసీసీ సెక్రటరీ, జిల్లా పరిశీలకుడు సంపత్‌కుమార్ మాట్లాడుతూ, దేశ చరిత్రలో మొట్టమొదటగా కాంగ్రెస్ ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇంట్లో కూర్చుని అభ్యర్థిని ఎంపిక చేస్తుందని, బీజేపీలో అమిత్‌షా కనుసైగలతో అభ్యర్థుల ఎంపిక జరుగుతోందన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లాల డీసీసీ అధ్యక్షుల ఎంపికకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలో ఎవరైనా డీసీసీ అధ్యక్ష పదవికోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పార్టీ అధ్యక్షుడి నియామకానికి సహకరించాలన్నారు. విలేకరుల సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కాల్వ సుజాత, గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వరాజన్ మహంతి

## డీసీసీ అధ్యక్ష పదవికి పలువురి దరఖాస్తు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ విశ్వరాజన్ మహంతికి, జిల్లా పరిశీలకుడు సంపత్ కుమార్‌కు పలువురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డికి ఇవ్వాలని నియోజకవర్గ పార్టీ కార్యకర్తలంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసి దరఖాస్తు అందజేశారు. అదేవిదంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, నాయకులు, కార్యకర్తలతో కలిసి దరఖాస్తు అందజేశారు. వీరితో పాటు టీపీసీసీ నాయకులు పున్న కైలాష్‌నేత, దయాకర్ కూడా దరఖాస్తు సమర్పించారు.

# ఏ వ్యవస్థతోనూ న్యాయశాఖకు విభేదాల్లేవు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్

భువనగిరి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏ వ్యవస్థతోనూ న్యాయశాఖకు విభేదాలు లేవని, వ్యక్తిగత ప్రయోజనాలకు చివరి స్థానం ఇస్తూ దేశ ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చే భారత సైన్యం తమకు ఆదర్శమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లాకోర్టు సముదాయానికి ఆయన శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. అన్ని రంగాల మాదిరిగానే న్యాయశాఖకు కూడా పలు సవాళ్లు ఉన్నాయని, అయినప్పటికీ ప్రజల సమానత్వం, గౌరవం, మర్యాద, ప్రాథమిక స్వేచ్ఛను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాజ్యాంగ లక్ష్యాలను, ప్రజల ఆకాంక్షలను న్యాయవ్యవస్థ నెరవేరుస్తున్నదని, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నదని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థలో సిబ్బంది, న్యాయవాదులు కూడా వాటాదారులేనని, వారందరూ నైతిక విలువలు పాటిస్తూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. న్యాయవ్యవస్థ అంతిమ లక్ష్యం దేశాన్ని, రాష్ట్రాన్ని బలంగా ఉంచడమేనన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు మానవ, సాంకేతిక, భౌతిక వనరుల సాయం తప్పనిసరన్నారు. కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం మంచిర్యాల జిల్లా కోర్టుకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్‌సింగ్

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు

నాగార్జునసాగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాల సెక్రటరీ బి.సైదులు అన్నారు. శనివారం పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా విభాగాల వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన వంటగది, హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నైపుణ్యంతో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. త్వరలో సాగర్ బీసీ డిగ్రీ కళాశాలను నిడమనూరుకు తరలిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీవో స్వప్న, బీసీ గురుకుల డిగ్రీ కళాశాల, పాఠశాల ప్రిన్సిపాళ్లు మాధవీలత, రవి కుమార్, భాస్కర్‌రెడ్డి, నితీష్, నాగరాజు, వెంకటేష్, సంతోష్, సరిత, రజని, నర్సింహ, అరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు కవి సమ్మేళనం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'విద్యలో అంతరాలు తొలిగిపోయేదెట్లా' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో ఈ కవి సమ్మేళనం ఉంటుందని టీపీఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాధేశ్యాం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు టీపీఎస్వీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'విశ్వభాష తెలుగు' పుస్తకావిష్కరణ

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత అంజయ్య రచించిన 'విశ్వభాష తెలుగు' పుస్తకాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి, కవి, రచయిత విద్యాసాగర్‌రావు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు తెలుగు భాష అంతరించి పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మాతృభాష తెలుగును బతికించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, నేలపట్ల సత్యనారాయణ, షణ్ముఖ, సాయిబాబు, రాజేశ్వరి, లింగయ్య, కొండల్, నాగభూషణం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన ఖవ్వాలి

తెల్లవారు జాము వరకు కొనసాగిన కార్యక్రమం



ఖవ్వాలిలో భక్తి గీతాన్ని ఆలపిస్తున్న కళాకారుడు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గుట్టమెట్ల వద్ద నిర్వహించిన ఖవ్వాలి భక్తులను అలరింపజేసింది. హైదరాబాద్‌కు చెందిన అలీజావిద్ వార్సీ కళా బృందం, నాగ్‌పూర్‌కు చెందిన కరిష్మాతాజ్ కళాకారుల బృందం వేర్వేరుగా ఆలపించిన భక్తి పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. లతీఫుల్లా షాఖాద్రిపై చేసిన కీర్తనలు ఆయన గొప్పతనాన్ని చాటి చెప్పాయి. భక్తులు ఖవ్వాలికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తి గీతాలకు అనుగుణంగా కొందరు భక్తులు నృత్యాలు చేశారు. సంగీత వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి. ఖవ్వాలి ఆదివారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఖవ్వాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ముతవల్లులు సయ్యద్ సమీఉల్లాఖాద్రి, గౌస్‌ఉల్లాఖాద్రి, సల్మాన్‌ఖాద్రి, సమద్, ఎస్.ఆర్.ఠాగూర్ జమాల్‌ఖాద్రి, ఉబైద్‌ఖాద్రి, గౌస్ మోహినుద్దీన్, ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఖవ్వాలి కార్యక్రమానికి హాజరైన భక్తులు

## తాను చనిపోతూ మరో ఆరుగురిలో జీవిస్తూ..


సైదులు(ఫైల్)

మోటకొండూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలానికి చెందిన యువకుడు తాను చనిపోతూ మరో ఆరుగురికి పునర్జన్మనిచ్చాడు. జీవన్‌దాన్ వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం చాడ గ్రామానికి చెందిన గంధమల్ల సైదులు(27) ఇంటి వద్ద ఉంటూ ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ నెల 2 దసరా రోజు సాయంత్రం దసరా వేడుకల్లో జమ్మికి వెళ్లి వచ్చాక ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి కంకరరాళ్లపై పడ్డాడు. దీంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబసభ్యులు భువనగిరిలోని ఏరియా తీసుకెళ్లగా, చికిత్స అందిస్తున్నా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనమేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సైదులు బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో మృతి చెందాడు. జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవ దానంపై సైదులు తల్లిదండ్రులు లక్ష్మీ, రాములుకు అవగాహన కల్పించడంతో అవయవదానికి వారు అంగీకరించారు. సైదులు శరీరం నుంచి రెండు కిడ్నీలు, రెండు కార్నియాలు, కాలేయం, గుండెలను సేకరించి మరో ఆరుగురికి అమర్చినట్లు వైద్యులు తెలిపారు. తన కుమారుడి అవయవాలతో మరో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చిన కుటుంబసభ్యులను వైద్యులు ప్రశంసించారు.

## గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు బాలాజీనాయక్ బాధితులు


గుడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట గుంపులుగా బాలాజీనాయక్ బాధితులు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీకి ఆశపడిన అమాయక ప్రజల నుంచి ఏజెంట్లను పెట్టుకుని రూ.కోట్లు కొల్లగొట్టిన బాలాజీనాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారంతో బాధితులు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు శనివారం తరలివచ్చారు. అందులో మండలంలోని పలుగుతండ, వద్దిపట్ల, పడమటితండ, నక్కలపెంటతండ గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దాదాపు 12 మంది ఫిర్యాదులు ఇవ్వగా మరికొందరు ఫిర్యాదులు చేస్తే తమ డబ్బులు వస్తాయో రావేమోనన్న భయాందోళనతో వేచిచూశారు. బాలాజీనాయక్‌ను నల్లగొండకు తీసుకువచ్చారన్న సమాచారంతో ఎస్పీ కార్యాలయానికి బయలుదేరివెళ్లారు. కాగా బాధితుల ఫిర్యాదులపై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించలేదు.

## నీటిమడుగులో చిక్కుకున్న వృద్ధుడు

● తాడు సాయంతో కాపాడిన మునిసిపల్ సిబ్బంది


నీటి మడుగు నుంచి తాడుసాయంతో క్షేమంగా బయటికి వచ్చిన సత్తయ్య

దేవరకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో నీటి మడుగులో చిక్కుకున్న వృద్ధుడిని మునిసిపల్ సిబ్బంది కాపాడారు. 3వ వార్డు ఇస్లాంపూర్ కాలనీ శివారులో ఇటీవలి వర్షాలకు నీటి మడుగు ఏర్పడింది. కాలనీకి చెందిన సత్తయ్య బహిర్భూమి అవసరాలకు వెళ్లి నీటి మడుగులో పడి కొట్టుకుపోయాడు. గమనించిన కాలనీవాసులు మునిసిపల్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే మునిసిపల్ సిబ్బంది హుటాహుటిన ఇస్లాంపూర్ కాలనీకి చేరుకొని నీటిగుంటలో చిక్కుకున్న వృద్ధుడిని తాడు సాయంతో బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. దీంతో మునిసిపల్ సిబ్బందిని కమిషనర్ సుదర్శన్‌తోపాటు కాలనీవాసులు అభినందించారు.

## వృద్ధ మహిళపై దాడిచేసి బంగారు గొలుసు చోరీ


సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

హాలియా, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వృద్ధ మహిళపై దాడి చేసి బంగారు పుస్తెల తాడు దోచుకున్న సంఘటన నల్లగొండ జిల్లా అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఐతగోని సత్తమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నరేందర్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి దాడి చేశాడు. మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారు పుస్తెలతాడు లాక్కొని పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన బాధితురాలు సత్తెమ్మను కుటుంబ సభ్యులు హాలియాలోని ఆదిత్య ఆస్పత్రికి తరలించారు. సత్తమ్మ కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. హాలియా సీఐ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ, ఎస్‌ఐ పరిశీలించారు. ఆసుపత్రిలో బాధితురాలు సత్తమ్మతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

## లిఫ్ట్ ప్రమాదంలో ఒకరు మృతి

నల్లగొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డు అబ్బాసియా కాలనీలో శనివారం సాయంత్రం జరిగిన లిఫ్ట్ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వేములపల్లి ఈజీఎస్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఖాజామొహినుద్దీన్ అబ్బాసియా కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అతడు రెండో అంతస్తు నుంచి కిందికి వచ్చేందుకు లిఫ్ట్ బటన్ నొక్కాడు. అయితే ఏమరపాటుగా ఉన్న అతడు లిఫ్ట్ కిందికి రాకుండానే గ్రిల్స్ ఓపెన్‌చేసి అడుగువేశాడు. అంతే కింది ఫ్లోర్‌లోకి పడిపోయాడు. ఆ తరువాత లిఫ్ట్ కిందికి రాగా, అది మీదపడి నలిగిపోయాడు. ఈ ప్రమాదం సాయంత్రం 6.30 గంటలకు జరగ్గా, రాత్రి 9గంటల వరకు ఎవ్వరూ గ్రహించలేదు. ఆ తరువాత అపార్ట్‌మెంట్ వాసులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయంతెలుసుకున్న వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వెండికి ఫుల్ డిమాండ్!

● వెండి కావాలంటే 10 రోజులు ఆగాల్సిందే

● పెరిగిన ధరలతో పట్టింపు లేకుండా కొనుగోళ్లు

● నెల వ్యవధిలోనే భారీగా పెరిగిన ధరలు




(ఆంధ్రజ్యోతి-రామగిరి)

ఒకప్పుడు వెండి కొనుగోలుకు పెద్దగా ఆసక్తి కనబరచని ప్రజలు ప్రస్తుతం తెగ కొనేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఏర్పడిన ఆర్థిక అనిశ్చితి కారణంగా వెండి ధరలు విపరీతంగా పెరిగాయి. నెల వ్యవధిలోనే 30శాతానికి పైగా ధర పెరిగినా, ధరలతో పట్టింపులేకుండా పెట్టుబడుదారులు తగ్గేదేలే అన్నట్టుగా విపరీతంగా కొని నిల్వ చేస్తున్నారు. భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉంటుందన్న ఆలోచనతో కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అవసరానికి తగ్గ సరఫరా లేకపోవడంతో వెండికి కొరత ఏర్పడింది. ఫలితంగా కాళ్ల పట్టీళ్లకు వెండి కావాలన్నా ఆర్డర్‌ఇచ్చి 10రోజులు ఆగాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

### సాధారణ ప్రజలకు ఇబ్బందులు

మూడునెలల కిందట 10 గ్రాముల వెండి రూ.700 నుంచి రూ.800 ఉండగా ప్రస్తుతం రూ.1800ల పైకి చేరింది. దీంతో సాధారణ ప్రజలు కనీసం కాలి మెట్టలు, పట్టీలకు ఇతర గొలుసుల వంటి వాటికి వెండి కొనుగోలు చేయాలంటే కనీసం 10రోజుల సమయం పట్టే పరిస్థితి ఏర్పడింది. దీంతో సాధారణ ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత మంది బడా పెట్టుబడిదారులు వెండి అవసరం లేకున్నా భవిష్యత్‌లో ధర పెరుగుతుందన్న ఉద్దేశంతో కిలోల కొద్దీ కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. ఫలితంగా సాధారణ ప్రజలకు ధర అందుబాటులో లేకపోవడంతో పాటు కొరత ఏర్పడింది.

### ఎలక్ట్రిక్ వాహనాల్లో వినియోగించడంతోనే



ఎలక్ట్రికల్ వస్తువులు, ఎలక్ట్రానిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్ వంటి వాటిలో వెండి ఉపయోగం విపరీతంగా పెరిగింది. దీనికి తోడు అంతర్జాతీయంగా ఏర్పడిన రాజకీయ అనిశ్చితి వెండి ధర పెరగడానికి కారణం. కొంతమంది అవసరం లేకున్నా భవిష్యత్తులో మంచి లాభాలు వస్తాయని వెండిని కొనుగోలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో కొరత ఏర్పడింది.

చొల్లేటి హరిప్రసాద్ స్వర్ణకార సంఘ పట్టణ అధ్యక్షుడు, నల్లగొండ.

### ధర పెరుగుదలకు కారణాలు

● అమెరికా డాలర్ బలహీనపడడం, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేటు తగ్గించడం

● ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ అలజడి, యుద్ధాలు, ఆర్థిక మందగమన భయాలు ఉన్నప్పుడు పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపడం.

● ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రిక్ వాహనాల్లో వెండిని కీలకంగా ఉపయోగించడం

● ప్రత్యేకంగా సోలార్ ఉత్పత్తులు గణనీయంగా పెరగడం

● ఇతర ఆస్తులతో పోలిస్తే వెండి ధర లాభదాయకంగా కనిపిస్తుండడంతో పెట్టుబడుదారుల అత్యంత ఆసక్తి.

● డాలర్ బలహీనతతో వెండికి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరగడం

## రసాయన వ్యర్థాల తరలింపులో ఉద్రిక్తత


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు, వ్యర్థాలను తరలించేందుకు తెచ్చిన టిప్పర్

చిట్యాలరూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామశివారులో శుక్రవారం రాత్రి వ్యర్థ రసాయనాల తరలింపు ఉద్రిక్తతకు దారితీసింది. రసాయన వ్యర్థాలను తీసుకెళ్లేందుకు వచ్చిన వారితో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 5వ తేదీన పిట్టంపల్లి గ్రామానికి చెందిన మెట్టు లింగయ్య తన గొర్రెలను గ్రామశివారు ప్రాంతానికి తీసుకెళ్లగా అక్కడ డంపింగ్ చేసిన బస్తాల్లోని రసాయన వ్యర్థాలను తిన్నాయి. మరుసటి రోజు గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. వాటిని పరిశీలించిన పశువైద్యాధికారి చికిత్స చేశారు. అయితే వ్యర్థాలు తిన్న గొర్రెల్లో 9 మృతి చెందగా మరో 70 గొర్రెలు అస్వస్థతకు గురిచెందాయి. మరునాడు రోజు మరో నాలుగు గొర్రెలు మృతి చెందాయి. ఈ నేపథ్యంలో రసాయన వ్యర్థాలపై గ్రామస్థులు నిఘా ఉంచారు. శుక్రవారం సాయంత్రం కార్లలో వచ్చిన నలుగురు వ్యర్థాలను ఎక్స్‌కవేటర్ సాయంతో టిప్పర్‌లో తరలించేందుకు సిద్ధమయ్యారు. గమనించిన స్థానికులు లింగయ్యతో పాటు సోదరుడు నర్సింహకు సమాచారమిచ్చారు. వారు వచ్చి అక్కడున్న వారిని మీరెవరని ప్రశ్నించడంతో పాటు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. వెంటనే నర్సింహ సెల్‌ఫోన్ లాక్కున్న అక్కడున్న వారు ఫోన్‌లో ఫొటోలు డిలీట్ చేశారు. వాగ్వాదం సమాచారం అందుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకునేలోగా నలుగురిలో ఇద్దరు కారులో వెళ్లిపోయారు.మిగిలిన ఇద్దరితో గ్రామస్థులు వాగ్వాదానికి దిగగా తాము కాలుష్యనియంత్రణ మండలి అధికారులమని బదులిచ్చారు. జీవాలకు హాని కలుగకుండా వ్యర్థాలు తరలిస్తున్నామన్నారు. జీవాలు మృతి చెందిన ఐదు రోజులకు రావడమేంటని స్థానికులు ప్రశ్నించారు. ఘర్షణ విషయం స్థానికులు చిట్యాల పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్‌ఐ అయితగాని వెంకటయ్య సిబ్బందితో చేరుకుని గ్రామస్థులతో చర్చించారు. వ్యర్థాలను వదిలిన కంపెనీని గుర్తించి, తగినచర్యలు తీసుకోవాలని, మృతిచెందిన గొర్రెలకు నష్టపరిహారాన్ని చెల్లించాలని భీష్మించారు. కాసేపు కాలుష్యనియంత్రణ మండలి అధికారులు, పోలీసులతో గ్రామస్థులు వాగ్వాదం చేశారు. పోలీసులు స్థానికులకు నచ్చజెప్పారు. రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో హామీ పత్రం రాయించి బస్తాలను నింపిన టిప్పర్‌ను చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో సమస్య సద్దుమణిగింది.

## చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


వెంకన్న (ఫైల్)

తుంగతుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చికిత్సపొందుతూ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం వెలుగుపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు గూడ వెంకన్న(48) మే నెలలో తాడి చెట్టు పైనుంచి జారిపడి తీవ్ర ంగా గాయపడ్డాడు. నాటి నుంచి మంచానికి పరిమితమై వివిధఆస్పత్రులలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

### పీపుల్‌పహాడ్‌లో..

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి చెందాడు. పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన పులన్‌గారి వెంకటేష్(54) శనివారం తాటికల్లు గీయడానికి చెట్టు ఎక్కారు. ప్రమాదవశాత్తు కాలుజారి పైనుంచి కిందపడటంతో తీవ్రగాయాలై వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంకటేష్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని గీతకార్మిక సంఘం నాయకులు రాయిగిరి కిష్టయ్య, ముష్కాల శ్రీనివాస్, బత్తుల లక్ష్మయ్య, అశోక్, మారగోని అశోక్‌లు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఇసుక డంప్‌ను పట్టుకున్న అధికారులు

ఆత్మకూరు(ఎం), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో బిక్కేరు వాగు నుంచి అక్రమంగా తరలించి డంపింగ్ చేసిన ఇసుకను గ్రామపాలన అధికారులు సీజ్ చేశారు. గ్రామస్థుల సమాచారంతో గ్రామపాలన అధికారులు దాసరి వీరయ్య, రాజయ్య, శ్రీనివాసాచారి ఇసుక డంపింగ్‌ను పరిశీలించారు. కామునిగూడెం గ్రామానికి చెందిన మాద ఉపేందర్ ఎలాంటి అనుమతులు లేకుండా బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి, పోసానికుంట గ్రామానికి చెందిన మల్లారెడ్డి వ్యవసాయ భూమిలో డంపింగ్ చేసి, విక్రయిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

## అనారోగ్య సమస్యలతో ఏఎస్‌ఐ ఆత్మహత్య


సత్యనారాయణగౌడ్(ఫైల్)

సూర్యాపేట రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో పోరాడుతూ జీవితంపై విరక్తి చెందిన ఏఎస్‌ఐ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వీవీఎన్‌క్లేవ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 1992 బ్యాచ్‌కు చెందిన గోపగాని సత్యనారాయణగౌడ్ నాగారం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ సూర్యాపేట పట్టణంలోని వీవీఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. మనిషి సహాయం లేనిదే నడవలేకపోవడం,విధులకు కూడా అతికష్టం మీద వెళ్తుండేవాడు. అయితే అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతూ జీవితం మీద విరక్తి చెందాడు. ఈ క్రమంలో శనివారం భార్య, కుమార్తె షాపింగ్‌కు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరని సమయంలో ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన భార్య, కుమార్తెలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

### అప్పుల బాధతో చిరువ్యాపారి...

గుండాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ తేజంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుండాల మండలకేంద్రానికి చెందిన శ్రీరాముల ఉప్పలయ్య(57) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతను చేస్తున్న చిరువ్యాపారం కోసం చేసిన అప్పులు తీర్చలేక భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన గుండాలకు చేరుకున్న ఉప్పలయ్య అదేరోజు ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. ఉప్పలయ్య కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ప్రమాదం తనవల్లే జరిగిందని డ్రైవర్


నర్సింహులు (ఫైల్)

రాజాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తన వల్లే ప్రమాదం జరిగిందన్న మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సోమారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ అనిల్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన బొమ్మకంటి రవి, సావిత్రి దంపతులకు ముగ్గురు సంతానం. మూడవ సంతానమైన నర్సింహులు(39) ఆటోనడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. తండ్రి రవి కొంతకాలం కిందట మృతి చెందడంతో తల్లి సావిత్రి అతడితోనే ఉంటుంది. ఈ నెల 10న ఆటోలో సోమారం గ్రామం నుంచి ఆలేరుకు స్కూల్ విద్యార్థులను, ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండగా కొలనుపాక వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో విద్యార్థులతో పాటు ప్రయాణికులు గాయపడ్డారు. తన నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మదనపడుతూ, మనస్థాపానికి గురై శుక్రవారం మధ్యాహ్నం గ్రామశివారులోని వ్యవసాయ బావి వద్ద క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను గ్రామస్థులు గమనించి చికిత్సనిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతు శనివారం మృతి చెందాడు. తల్లి సావిత్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా తనయుడు నర్సింహులుకు తల్లి సావిత్రి దహనసంస్కారాలు నిర్వహించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భువనగిరి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణం జగదేవ్‌పూర్ రోడ్డులో శనివారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానిక పహాడినగర్‌కు చెందిన యాకూబ్ బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో గాయపడిన ఆయనకు జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నెల ముందే ఈనిన వరి పంట

● నకిలీ విత్తనాలు వల్లే నష్టపోయామంటున్న రైతులు

● వ్యవసాయాధికారులకు ఫిర్యాదు


నెలముందే ఈనడానికి వచ్చిన పొలం, పైరును పరిశీలిస్తున్న అధికారులు

కోదాడ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల ముందే ఈనిన(పాలు పోరకుండానే) పంటలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో చీడ, పీడల ప్రబలకుండా అనేక మందులు పిచికారీ చేసి పంటలు కాపాడుకున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో నెలరోజుల ముందే ఈనడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాలుపోయకుండా ఈనడంతో పంట మొత్తం తాలుగా మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు పడి బావులు, కుంటలు, చెరువుల్లోకి నీరు చేరడంతో కాల్వ చివరి భూముల్లో సైతం పంటలు సాగు చేశారు. వరి నాట్లు వేసిన దగ్గరి నుంచి రైతులు అనేక ఇబ్బందులుపడ్డారు. ఈ ఏడాది యూరియా కూడా దొరక్క అవస్థలు పడ్డారు. కోదాడ మండలం కూచిపూడి గ్రామంలో వానాకాలం ప్రారంభ దశలో కోదాడలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల నుంచి వరి విత్తనాలను కొనుగోలు చేశారు. శ్రీరామ సీడ్స్, సిటీ 101, సత్యం సీడ్స్, వంశీ సీడ్స్ తదితర కంపెనీలకు చెందిన వరి విత్తనాలతో వరి సాగు చేశారు. 10 కిలోల విత్తనాల బ్యాగుకు రూ.1000 నుంచి రూ.1,300 చెల్లించామని, ఇందుకు సంబంధించిన బిల్లులు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు.

ధాన్యం నారుపోసి నాటు వేసిన రెండు నెలలకే పొలం ఈనడం మొదలైందన్నారు. నెలరోజుల ముందే పంట ఈనడం వల్ల ఎకరాకు 40 బస్తాలయ్యే ధాన్యం 10 బస్తాల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.35 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టామన్నారు. కూచిపూడి గ్రామంలో సుమారు 100 నుంచి 200 ఎకరాల్లో ఈ విత్తనాలతో పంటలు సాగుచేయడం వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆదుకుని తమకు తగిన నష్టపరిహారం ఇప్పించాలని రైతులు చేతుల రామకృష్ణ, శిరంశెట్టి రామారావు, శెట్టి శ్రీనివాసరావు, శిరంశెట్టి రవి, తెల్లగొర్ల రామకృష్ణ, రమణ, చాప సురేష్, తెల్లగొర్ల తిరపయ్య, తెల్లగొర్ల భవాని, శిరంశెట్టి నాగేశ్వరరావు, రామారావు, గోవిందస్వామి కోరారు. ఈ విషయమై వ్యవసాయాధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

### శాస్త్రవేత్తలకు సమాచారమిచ్చాం

కూచిపూడి గ్రామంలో నెల రోజుల ముందే పంట ఈనడంపై రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని పరిశీలించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలకు సమాచారం అందించాం. వారు వచ్చిన వెంటనే పొలాలను పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామన్నారు. సుమారు 50 ఎకరాలకు పైగా వరిపంటకు నష్టం జరిగింది.

## బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కృషి

● ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న

హుజూర్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లు అమలుచేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలు బీసీలను అణచివేసేందుకు కుట్ర చేస్తున్నాయన్నారు. 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టుకు వెళ్తుందన్నారు. బీసీలకు న్యాయం జరిగేంత వరకూ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీసీలపై ప్రతిపక్షాలు కపట ప్రేమ కనబరుస్తున్నాయన్నారు. బీసీ పోరాటాలకు అన్నివర్గాలు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో బీసీ చట్టం అమలుకు ప్రయత్నిస్తోందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు, కేంద్రానికి పంపిందన్నారు. సుప్రీంకోర్టులో బీసీలకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బెల్లంకొండ గురయ్య, రామరాజు, చింతకాయల రాము, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ గవాయ్‌పై దాడి మత ఉన్మాదుల చర్య


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున

నల్లగొండ రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జస్టిస్ గవాయ్‌పై దాడి మతోన్మాదుల చర్య అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంవీఎన్ ట్రస్ట్ భవనంలో శనివారం నిర్వహించిన కేవీపీఎస్, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రౌండు టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనే భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది షూ విసిరే ప్రయత్నం చేయడం దేశ చరిత్రలో చీకటి రోజు అని అన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, కొండ వెంకన్న, దండెంపల్లి సత్తయ్య, వెంకటేష్, నరేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

రామన్నపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు ఆవుల శ్రీధర్ యాదవ్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిన అంశంపై యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో శనివారం ఆయన స్పందించారు. బీసీల హక్కులు, అవకాశాలకు రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. ప్రస్తుతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు బీసీలను మోసం చేశాయన్నారు.

# సాగర్ 6 గేట్ల ద్వారా నీటి విడుదల



సాగర్ 6 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు 6 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు ప్రాజెక్టు అధికారులు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రం 590 అడుగులుగా (312.0450టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10040 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 7353 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,536 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లల్లో 6 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 348,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 100729 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి అంతే మొత్తంలో వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరదకాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

### మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపలి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి దిగువన గల మూసీ రిజర్వాయర్‌లో చేరుతుంది. ఈ క్రమంలో ఇన్‌ఫ్లో శనివారం సాయంత్రానికి 3031.92క్యూసెక్కులుగా నమోదైంది. మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 644.28అడుగులు(4.27టీఎంసీలు)ల గరిష్ఠ స్థాయిలో చేరడంతో అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా క్రస్ట్ గేట్లను ఎత్తి 2580.88క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు విడుదలవుతున్నమరో 340.83క్యూసెక్కుల నీటిని కలుపుకుని ప్రాజెక్టు నుంచి మొత్తం 2970.33క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.30అడుగులు(4.28టీఎంసీలు)గా ఉంది.

## తొలి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు

కొండమల్లేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబావి గ్రామానికి చెందిన ఏరుకొండ రాము, లలిత దంపతుల కుమారుడు చరణ్‌తేజ్ మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఇటీవల వెలువడిన నీట్ ప్రవేశ పరీక్షలో 508 మార్కులతో రాష్ట్రస్థాయిలో 649 ర్యాంకు సాధించిన చరణ్‌తేజ్ వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు పొందాడు. చరణ్‌తేజ్ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై అతడి కుటుంబసభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చరణ్‌తేజ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో కార్డియాలజిస్టుగా ప్రజలకు ఉత్తమసేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపారు.



తల్లిదండ్రులతో చరణ్‌తేజ్

# రక్తమోడుతున్న రహదారి

- కోదాడ - జడ్చర్ల జాతీయ రహదారిపై ప్రమాదాలు
- దేవరకొండ మండలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు
- నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు దుర్మరణం
- మృతి చెందుతున్న మూగజీవాలు



దేవరకొండ పట్టణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన గేదె (ఫైల్ ఫొటో)

దేవరకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారి 167 దేవరకొండ మండలం కొండభీమనపల్లితో పాటు పట్టణ శివారులో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. అంతేకాక మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయి. దీంతో మూగజీవాల యజమానులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దేవరకొండ మండలం కొండభీమనపల్లి శివారులో ఈ నెల 6వ తేదీన లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై దేవరకొండకు వస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు చెందిన కొండ్ర శివ (29), మర్రిగూడ మండలం దామెర భీమనపల్లికి చెందిన చాపల మాధవి(30) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ నెల 10వ తేదీన దేవరకొండ పట్టణంలో ప్రధాన రహదారిపై ట్రాక్టర్ ఆటోను



కొండభీమనపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండ్ర శివ(ఫైల్ ఫొటో)

ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న దేవరకొండ మండలం కమాలపూర్ గ్రామానికి చెందిన ద్రౌపతమ్మ (56) మృతి చెందింది. దీంతో పాటు ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి.

జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణం డ్రైవర్లు అతివేగం, అజాగ్రత్తగా నడపడమే. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో ప్రజలతోపాటు మూగజీవాలు మృతి చెందుతున్నాయి. ఆటో డ్రైవర్లు సైతం కెపాసిటీకి మించి ప్రయాణికులను చేరవేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే అనేక మంది మృత్యువాతకు గురికావడం, గాయాలపాలవుతున్నారు. పోలీస్ అధికారులు తనిఖీలు చేసి రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



దేవరకొండ మండలంలోని జడ్చర్ల - కోదాడ రహదారిపై ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశాం. త్వరలో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తాం. స్పెషల్ డ్రైవ్ చేపడుతాం.

\- వెంకట్‌రెడ్డి, దేవరకొండ సీఐ

## మట్టపల్లి వంతెనపై నీరు

● ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు



కృష్ణానదిపై మట్టపల్లి వంతెనపై నిలిచిన వర్షపునీరు

మఠంపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సమీపంలోని కృష్ణానదిపై రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన హైలెవల్ వంతెనపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉభయరాష్ట్రాలను కలుపుతూ మట్టపల్లి వద్ద వంతెన నిర్మించారు. ఈ వంతెనపై రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడుగులోతు వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం ఈ వంతెనను నిర్మించగా అప్పట్లో వర్షపు నీరు కృష్ణానదిలోకి వెళ్లేలా అక్కడక్కడా పైపులు ఏర్పాటు చేశారు. వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండటంతో దుమ్ము, మట్టితో ఇవి పూర్తిగా పూడిపోయి వంతెనపైనే నీరు నిల్వ ఉంటోంది. వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో పాదచారుల కోసం ఏర్పాటు చేసిన కాలిబాటలో నడిచి వెళ్లేవారిపై ఈ మురుగునీరు పడి దుస్తులు తడిసిపోతున్నాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. రోజుల తరబడి నీరు అలానే ఉంటుండటంతో సీసీ చేసిన వంతెనపై కంకరతేలి గుంతలు పడుతున్నాయి. నిరంతరం రాకపోకలు సాగించే లారీలు బస్సులతో గుంతలు మరింతగా పెద్దవవుతున్నాయి. సంబంధిత అధికారులు పైపుల్లో మట్టి తొలగించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సిబ్బందిని పంపి పైపుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తామని, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## మూడేళ్లలో విష్ణుపురం డబ్లింగ్ పనులు

● సికింద్రాబాద్ డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్



మంచ్యాతండా రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం గోపాలకృష్ణన్

మఠంపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా విష్ణుపురం-మోటుమర్రి వరకు నిర్మిస్తున్న రైల్వే డబ్లింగ్ పనులను మూడేళ్లలో పూర్తి కానున్నట్లు సికింద్రాబాద్ డీఆర్ఎం డాక్టర్ గోపాలకృష్ణన్ తెలిపారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మంచ్యాతండా వద్ద గల శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ రైల్వేస్టేషన్‌లో పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. డబ్లింగ్ పనులు ఇంకా 86కిలోమీటర్ల లైన్ పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈ మార్గం పూర్తయితే ప్రయాణికులకు మరింత సౌకర్యాలను కల్పించడంతో పాటు దూరం తగ్గి, గమ్యానికి సులభంగా చేరేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జగ్గయ్యపేట వరకు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు మిర్యాలగూడ నుంచి నడికుడి, విజయవాడ వెళ్లేందుకు మార్గం సుగమవుతుందన్నారు. సుమారు 60కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ప్రయాణికుల రక్షణ, భద్రతే లక్ష్యంగా తమ వంతు కృషి చేస్తున్నట్లు డీఆర్ఎం తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్ మధిర బ్రాంచి సభ్యుడు డీఆర్ఎంను కలిసి మఠంపల్లి రైల్వేస్టేషన్ సెక్షన్‌లో ఉద్యోగులకు వసతి గృహాలు, మెస్‌డోర్లు, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయలు కల్పించాలని సంఘం ప్రధానకార్యదర్శి శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటిక మూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొన సాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.36,59,010 ఆదాయం సమకూరినట్లు ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. స్వామివారిని తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం సతిసమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు ప్రొటోకాల్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఈవో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకగా ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ పూజారులు స్వాగతం పలికారు. అదేవిధంగా ప్రతీవారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా త్రి నేత్ర ఆర్ట్స్ అకాడమీ రాజ్‌కుమార్ (హైదరాబాద్) శిష్యబృందం కూచిపూడి నృత్యం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

### యాదగిరీశుడి సేవలో టీజీపీఎస్సీ చైర్మన్ వెంకటేశం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం సతీసమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువుల వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ముఖమండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశంకు లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఇన్‌చార్జి ఈవో రవినాయక్



ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్‌సింగ్‌కు ఆశీర్వచనం చేస్తున్న ప్రధానార్చకుడు వెంకటాచార్యులు

### ఆలయ నిర్వహణ అభినందనీయం

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్**

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుల ఆలయ నిర్వహణ అభినందనీయమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్‌కుమార్‌సింగ్ అన్నారు. యాదగిరిగుట్ట దివ్యక్షేత్రాన్ని శనివారం న్యాయమూర్తులతో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. ఆలయ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ భక్తులకు ఆధ్యాత్మికను ప్రత్యేక అనుభూతి పొందే విధంగా అధికారుల కృషి ఉందన్నారు. యాదగిరిగుట్ట దివ్యక్షేత్రాన్ని సందర్శించడం ఎంతో అదృష్టమన్నారు. ఆలయం, ఉపాలయాల్లో దేవతామూర్తులకు మొక్కులు తీర్చుకుంటూ శిల్పాలను నిశితంగా పరిశీస్తూ అత్యాద్భుతంగా నిర్మాణం జరిగిందన్నారు. భక్తుల కొంగుబంగారంగా కోర్కే తీర్చే ఈ దివ్యక్షేత్రం విశ్వక్షేత్రంగా వినుతికెక్కడం ఆనందకరమన్నారు. ఆలయంలో చేసిన ఏర్పాట్లపై అధికారులకు కితాబునిచ్చారు.

**స్వామివారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు**

లక్ష్మీ నరసింహస్వామివారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్‌సింగ్‌తో పాటు దివ్యక్షేత్రాన్ని శనివారం న్యాయమూర్తులు కె.లక్ష్మణ్, కె.శరత్, కె.సృజన, వి.రామకృష్ణారెడ్డి ఆలయంలో స్వామిని దర్శించుకొని గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తుల పర్యటన సుమారు 2గంటల పాటు సాగింది. ప్రొటోకాల్ కార్యాలయ నుంచి బ్యాటరీ వాహనంలో సంప్రదాయ దుస్తుల్లో తూర్పురాజగోపురం చేరుకొని ముందుగా దివ్య విమాన స్వర్ణ గోపురం దర్శించుకొని న్యాయమూర్తికి ఆలయ పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద మొక్కులు తీర్చుకున్న న్యాయమూర్తులు గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ముఖ మండపంలో ప్రధానార్చకులు కాందూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులుతో పాటు పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజ్, కలెక్టర్ ఎం.హనుమంతరావు, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ మొక్కలను అందజేసి స్వాగతం పలికగా న్యాయమూర్తికి పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవో మాలి కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, తహసీల్దార్ గణేష్‌నాయక్, ఆలయ ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి కృష్ణ, ఏఈవో రఘు, పర్యవేక్షకులు నటరాజు, వెంకటేశ్వర్లు, రాజన్‌బాబు పాల్గొన్నారు.



స్కాట్లాండ్‌లో కల్యాణోత్సవంలో తాళిబొట్టును చూపుతున్న పూజారి కిరణ్‌కుమార్‌చార్యులు

### స్కాట్లాండ్‌లో లక్ష్మీనరసింహుల కల్యాణం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణం స్కాట్లాండ్ వైభవంగా జరిగింది. యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవస్థాన పూజారులు హిందూ మందిరంలో వేద మంత్రాలతో కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారి సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజారులు అత్యంత వైభవంగా చేపట్టారు. కల్యాణోత్సవంలో భాగంగా యూకేటీఏ ఆధ్వర్యంలో శ్రీనృసింహ వైభవం నృత్య నాటిక, పేరిణి నృత్య ప్రదర్శనలు భక్తులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, పూజారి వి. కిరణ్‌కుమార్‌చార్యులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతపై కేంద్రప్రభుత్వం దృష్టి

● నాబార్డు డీడీఎం డి.రవీంద్రనాయక్

గరిడేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దేశ జనాభా పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రతపై దృష్టి సారించిందని నాబార్డు సూర్యాపేట డీడీఎం డి.రవీంద్రనాయక్ అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన(పీఎండీడీకేవై) పథకం ఆవిష్కరణ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందుకు రైతులకు రూ.42 వేల కోట్లకు పైగా విలువైన వ్యవసాయ ప్రాజెక్టుల కానుకగా ఇచ్చినట్లు చెప్పారు. ప్రధానమంత్రి ధన్-ధాన్యకృషి యోజన, పప్పు ధాన్యాల స్వావలంబన మిషన్ ప్రారంభం, వ్యవసాయ మౌలిక వసతుల నిధి, పశు సంవర్ధక, మత్స్య ఆహార రంగాల్లో 1,100కి పైగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రైతులు నిత్యం ఒకే పంటపై ఆధార పడకుండా సమగ్ర వ్యవసాయ విధానాల్లో భాగంగా వరితో పాటు కూరగాయలు, పండ్ల మొక్కలు పెరటి కోళ్లు, పశువులు, చేపల పెంపకంలాంటివి చేయడం ద్వారా అధిక లాభా లు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి, సీనియర్ సైంటిస్ట్ డి.నరేష్, తుంగతుర్తి, హుజూర్‌నగర్ ఏడీఏలు రమేష్‌బాబు, రవినాయక్, ఏవో ప్రీతంకుమార్, శాస్త్రవేత్తలు నరేష్, కిరణ్, సుగంధి, ఏ.నరేష్, ఇఫ్కో కంపెనీ మేనేజర్ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గడ్డిపల్లి కేవీకేలో ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి వీక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం రవీంద్రనాయక్

## గోపలాయపల్లిలో సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రం శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ మాసం రోహిణి నక్షత్రం రోజున దేవస్థానం ఆధ్వర్యంలో ఈ యజ్ఞాన్ని చేస్తున్నారు. హోమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ఉత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డిమోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు, ఈవో చిట్టిడి వెంకట్‌రెడ్డి, పాండురంగారావు, భానుమతి, దేవేందర్‌గౌడ్, బక్కయ్య, ఉదయ్ కుమార్, సునీల్‌కుమార్, రవీందర్, శ్రీనివాస్ దంపతులు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సైదులునామా అటవీలో పులి సంచారంపై వదంతులు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్థులు

పాలకవీడు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ పరిధిలోని సైదులునామా అటవీలో పులి సంచరిస్తుందంటూ వదంతులు రావడంతో అటవీశాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. అటవీ ప్రాంతంలో జంతువుల పాదముద్రలను గుర్తించారు. ఆ ముద్రలు పులిది కాదని నిర్ధారించారు. పులి పాదముద్ర 8 నుంచి 10 సెంటీమీటర్ల పొడవు, 5 సెంటీమీటర్ల వెడల్పు వరకు ఉంటుందని తెలిపారు. కానీ ఇక్కడ జంతు పాదముద్రలు 3 సెంటీమీటర్లలోపే ఉన్నాయని అన్నారు. ఇవి పాదముద్రలు తోడేలు లేదా అడవి కుక్క అయి ఉండొచ్చని నిర్ధారించారు. ప్రజలు భయపడాల్సిన అవసరంలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.





జాన్‌పహాడ్ అటవీ ప్రాంతంలో జంతు పాదముద్రలను కొలత వేస్తున్న అధికారులు

### నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11 కేవీ సబ్‌స్టేషన్ ప్రకాశంబజార్ ఫీడర్ పరిధిలో లైన్ షిఫ్టింగ్, మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఏడీఈ వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో మిర్యాలగూడరోడ్డు, ప్రకాశంబజార్, మాన్యంచెల్క, ఎఆర్‌గార్డెన్, రహమత్‌నగర్, అన్సారీకాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### అనారోగ్య బాధితుడు జానీకి ఎల్‌వోసీ అందజేత

శాలిగౌరారం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన పానుగంటి జాని కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన జాని అనారోగ్య విషయం తెలుసుకున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు స్పందించి సీఎం సహాయనిధి నుంచి లక్ష రూపాయల ఎల్‌వోసీని మంజూరు చేశారు. నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, నిమ్స్ ఆస్పత్రిలో జానికి ఎల్‌వోసీ అందజేశారు.

## రేషన్‌బియ్యం కోసం తప్పని తిప్పలు


రాజపేట తండాలో రేషన్ సరుకుల కోసం వేచి చూస్తున్న గ్రామస్థులు

మర్రిగూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌక ధరల దుకాణం (రేషన్ షాప్) బియ్యం కోసం లబ్ధిదారులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని రాజంపేట తండా గ్రామపంచాయతీ పరిధిలో రేషన్‌దుకాణం లేక ప్రజలు రేషన్ బియ్యం తెచ్చుకోవడం కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వట్టిపల్లి గ్రామానికి వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాజుపేట తండా గ్రామం వట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉండేదని, అయితే 2018లో వట్టిపల్లి గ్రామం నుంచి వీడి నూతనంగా రాజుపేట తండాను అప్పటి ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. నూతనంగా రాజపేట తండా గ్రామపంచాయతీగా ఏర్పడి ఏడేళ్లవుతుంది. అప్పటి నుంచి నేటి వరకు కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు చేయకపోవడంతో 1700 మంది లబ్ధిదారులు రేషన్‌బియ్యం కోసం నానాతంటాలు పడుతున్నారు. పలుసార్లు గ్రామస్థులు రాజుపేట తండాకు కొత్తరేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని రెవెన్యూ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనివల్ల ప్రజలను పలు ఇబ్బందులు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం కోసం వృద్ధులు సైతం రెండు కిలోమీటర్ల దూరం ఉన్న వట్టిపల్లి గ్రామానికి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాజపేట తండా గ్రామంలో కొత్త రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

## చేనేత రుణాలు మాఫీ చేయాలని వినతి

నార్కట్‌పల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చేనేత రుణాలను మాఫీ చేయాలని కోరుతూ తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోచం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీరేశానికి శనివారం అమ్మనబోలులో వినతిపత్రం సమర్పించారు. చేనేత కార్మికుల రుణమాఫీ చేస్తామని ప్రకటించి సుమారు ఏడాది దాటినా ఇంతవరకు చేయలేదన్నారు. చేనేత కార్మికుల సమస్యలను సీఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రుణాలు మాఫీ అయ్యేలా చొరవ చూపాలని ఎమ్మెల్యేను వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మునిపంపుల చేనేత సహకార సంఘం డైరెక్టర్ రాపోలు వెంకటేశం, వనం మార్కండేయ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# 108 అందుబాటులో లేక..

- సకాలానికి చేరుకోని అంబులెన్స్‌లు
- గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చలేక విషమిస్తున్న ప్రాణాలు



నార్కట్‌పల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి (వట్టిమర్తి) బస్ స్టేజీ వద్ద 6 నెలల క్రితం ఓ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించాల్సి ఉంది. అక్కడే ఉన్న గ్రామస్థులు కొందరు 108 అంబులెన్స్‌కు చేశారు. ఆ సమాచారం కాస్తా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌కు చేరింది. కానీ అదే సమయంలో ఇదే జాతీయ రహదారిపై కట్టంగూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను ఆసుపత్రికి తరలించే విధుల్లో ఆ అంబులెన్స్ సిబ్బంది ఉన్నారు. మేము రావాలంటే కనీసం అరగంటకు పైగా పడుతుందన్న సమాచారాన్ని అందించారు. అప్పటికే సమయం మించిపోయింది ఏదో ప్రైవేటు వాహనంలో క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించినా గోల్డెన్ అవర్‌లో తీసుకువస్తే బాగుండేదనే సమాధానం వచ్చింది. తాజాగా ఇదే గోపలాయపల్లిలో ఓ మహిళ గడ్డిమందు తాగింది. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా మళ్లీ అదే సమాధానం వచ్చింది. ఏదో విధంగా కుటుంబసభ్యులు ఆ మహిళను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విషమ పరిస్థితిలో చికిత్స పొందుతోంది. జాతీయ రహదారిపై అదనంగా ఓ 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్న అవసరం ఈ రెండు ఘటనల ద్వారా అవగతమవుతోంది. చిట్యాల మండల కేంద్రానికి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినపడుతోంది.

**చిట్యాలకు ఇవ్వలే...**

జాతీయ రహదారిపై మొదటి నుంచి నకిరేకల్, నార్కట్‌పల్లిలో 108 అంబులెన్స్‌లు ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని మండలాల్లో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగానే కట్టంగూరు, కేతేపల్లి చిట్యాల మండలాలకు 6 నెలల క్రితం నూతన 108 అంబులెన్స్‌లు వచ్చాయి. కానీ కారణమేంటో ఇతమిద్దంగా తెలియదు కానీ చిట్యాల మండలానికి అంబులెన్స్‌కు ఇవ్వలేదు. హైవేపై పంతంగి టోల్‌ప్లాజా చిట్యాలకు దగ్గరగా ఉందని పైగా టోల్‌గేట్ వద్ద ఓ అంబులెన్స్ ఉందనే కారణాన్ని అధికారులు చూపినట్లు తెలిసింది. కానీ టోల్ గేట్ వద్ద ఉన్న అంబులెన్స్ కేవలం ట్రామా కేసులే తప్ప మెడికల్ కేసులకు సంబంధించిన బాధితులను ఆసుపత్రికి తరలించడం లేదని తెలిసింది. నార్కట్‌పల్లి నుంచి అంబులెన్స్ వెళ్లాల్సి వస్తుంది. సకాలంలో ఆసుపత్రికి చేరలేక మెడికల్ కేసుల బాధితుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

గోపలాయపల్లిలో ఓ మెడికల్ కేసు బాధితురాలిని సకాలంలో ఆసుపత్రికి తరలించే అవకాశం లేక ఆమె పరిస్థితి విషమించింది. నార్కట్‌పల్లిలో ఉన్న 108 అంబులెన్స్ కట్టంగూర్ శివారులో జరిగిన ప్రమాదం వద్దకు వెళ్లడం జరిగింది. అదే చిట్యాల మండల కేంద్రంలోనూ ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తే మెడికల్ లేదా ట్రామా కేసులను సకాలంలో అటు రామన్నపేట ఏరియా ఆసుపత్రికో లేదా నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికో తరలించే అవకాశం ఉంటుంది.

**చిట్యాలకు 108 అంబులెన్స్‌ను ఇవ్వాలి**



జాతీయ రహదారిపై ఉన్న చిట్యాల మండలానికి ప్రభుత్వం 108 అంబులెన్స్‌ను మంజూరు చేయాలి.6 నెలల వ్యవధిలో మాగ్రామానికి సంబంధించిన ఓ రోడ్డు ప్రమాదం, మరో మెడికల్‌కేసుకు సంబంధించిన ఘటనల్లో 108 అంబులెన్స్ లేని కారణంగా గోల్డెన్ అవర్ దాటిపోయిందనే సమాధానం డాక్టర్లు తెలిపారు. మండల కేంద్రంలో అంబులెన్స్ ఉంటే వారిని గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించే అవకాశం ఉండేది. చిట్యాలలో 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో గ్రామస్థులం 108జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చాం.

**- యాట చంద్రశేఖర్,గోపలాయపల్లి**

**3 నెలల్లో 5 అంబులెన్స్‌లు**



జిల్లాలో మొత్తం 33 మండలాలకు గాను 28 మండలాల్లో 108 అంబులెన్స్‌లు ఉన్నాయి. మిగిలిన 5 మండలాలైన చిట్యాల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి, నేరేడుగొమ్ము, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలో 108 అంబులెన్స్‌లు రానున్నాయి. సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లలో ప్రస్తుతం ఫ్యాబ్రికేషన్ పనులు జరుగుతున్నా యి. మరో 3 నెలలలోపే ఆ 5 మండలాలకు అంబులెన్స్‌ల సేవలను అందుబాటులోకి తెస్తాం.

**- మధు, జిల్లా మేనేజర్ 108 అంబులెన్స్**

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి


నాంపల్లిలో బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకన్న

నాంపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు మిర్యాల వెంకటేశం, నరేందర్‌రెడ్డి, పాలగోని శ్రీకాంత్, నాంపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జీపీ కార్మికులకు గ్లౌజులు, మాస్కుల పంపిణీ


జీపీ కార్మికులకు గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కట్టంగూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం టాక్ ఆన్‌వెల్ బీయింగ్ శానిటేషన్ వర్కర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు పంచాయతీ కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, ఉపాధ్యాక్షుడు రెడ్డిపల్లి సాగర్, కల్లూరు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బసవేజు వినోద్, కోశాధికారి రాములు, సభ్యులు ఆకారపు బ్రహ్మాచారి, రాపోలు వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, జీపీ సిబ్బంది సత్తయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## విక్రమ్‌రెడ్డి అకాలమృతి పార్టీకి తీరని లోటు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విక్రమ్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శానాల యుగేందర్‌రెడ్డి కుమారుడు విక్రమ్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం విక్రమ్‌రెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యేలు సామేలు, వీరేశం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో పాటు తండ్రి యుగేందర్‌రెడ్డిని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షు లు కందాల సమరంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, జిల్లా ఉ పాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ భూపతి ఆంజయ్య, నో ముల జనార్ధన్, ఇంతియాజ్ అహ్మద్, మంగదుడ్ల శ్రీనివాస్, దేవరకొండ జయరాజ్, పల్స సైదులు, బొల్లికొండ గణేష్, కడారి అంజయ్య, గన్నపురెడ్డి, బిక్షంరెడ్డి, శ్రీరాములు, నరేష్, దానయ్య, అరుణ్‌కుమార్, ఇబ్రహీం, కృష్ణ, బొమ్మగాని రవి తదితరులు పాల్గొన్నారు. విక్రంరెడ్డి మృతదేహంపై బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధి, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శాలిగౌరారం మండల అధ్యక్షులు ఐతగోని వెంకన్న గౌడ్, మండల మాజీ అధ్యక్షులు కట్టా వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్ బాబు, మాచర్ల అంజయ్య, ఆచారి పాల్గొన్నారు.

## నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కేతేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు కేతేపల్లి మండలంలో ఐకేపీ, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ తెలిపారు. మండలంలోని 16గ్రామ పంచాయతీలకుగాను 5 గ్రామాల్లో పీఏసీఎస్, 3గ్రామాల్లో డీసీఎంఎస్, మరో 3 గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మండలంలోని చీకటిగూడెం, చెరుకుపల్లి, ఉప్పలపహాడ్, కొర్లపహాడ్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్, ఇప్పలగూడెం, ఇనుపాముల, కొండకిందిగూడెం కేంద్రాలను డీసీఎంఎస్, గుడివాడ, కొత్తపేట కేంద్రాలను ఐకేపీ నిర్వహించనుంది. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభిస్తారని శ్రీనివాసయాదవ్ వివరించారు.

## నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం


బి.వెల్లెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, కట్టంగూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, నాయకులు పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, దార యాదయ్య, జెరిపోతుల భరత్, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, మాదాసు చంద్రశేఖర్, నర్సింహ, బింగి కొండయ్య, రాజు, యుగేందర్‌రెడ్డి, నర్సింహ, బింగి మహేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

కట్టంగూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. కట్టంగూరు శనివారం మండలంలోని అయిటిపాముల, చెర్వుఅన్నారం, గార్లబాయిగూడెం, కురుమర్తి, మునకుంట్ల, ఈదులూరు, నారెగూడెం, పరడ, కట్టంగూరు, ముత్యాలమ్మగూడెం గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ఏ గ్రేడ్‌కు రూ.2389, బీ గ్రేడ్‌కు రూ.2369 మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారు పండించిన ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లు తరలించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల, డీపీఎం మోహన్‌రెడ్డి, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ స్పెషల్ ఆఫీసర్, క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ పుష్పలత, ఎంపీవో స్వరూపరాణి, ఏపీఎం రాములు, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఐతగోని ఝాన్సీ, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు పాల్గొన్నారు.

## 14న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

- బీసీ సంఘాల పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండటౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం బంద్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఈ నెల 14న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త బంద్ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా బీసీలందరూ చేపట్టాలని, గ్రామాల్లో కూడా ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమం ప్రజాస్వామ్యబద్ధంగా బీసీల ఆత్మగౌరవం కోసం, అవమానాలకు వ్యతిరేకంగా కొనసాగుతుందన్నారు. హైకోర్టు ఎన్నికల ప్రక్రియను ఆపడం దురదృష్టకరమని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపరాదని, గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని అన్నారు. ఆ ఆదేశాలకు విరుద్ధంగా వాయిదా వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56శాతం బీసీల హక్కులకు విఘాతం కలిగిస్తుందని, బీసీల ఆత్మగౌరవం దెబ్బతినడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లోనూ పెట్టాలని పోరాడుతున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు మద్దతుగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండుచెరువు వెంకన్నగౌడ్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు అనంత నాగరాజు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు కన్నబోయిన రాజుయాదవ్, ప్రెసిడెంట్ మార్గం సతీష్‌కుమార్, గడగోజు విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు చిన్నోజు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై గ్రామసభలు

మర్రిగూడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరం రూ.6.40 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ పనులపై ఈ నెల 13 నుంచి ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. 14వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఉపాధిహామీ పథకం పనులపై ఈ నెల నుంచి పీఆర్‌పీఎస్ఆర్‌పీలు మండలంలోని 18 గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన పనులను వారు పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రామ సభలను ఈ నెల 16వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ చేసిన వాటిపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


రాజపేట తండాలో పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్ సురేందర్

మర్రిగూడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ సురేందర్ అన్నారు. మండలంలోని రాజాపేట గ్రామంలో పశువైద్య పశుసంవర్ధక ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆవులకు గర్భకోశ చికిత్స గేదెలకు సాధారణ చికిత్సను నిర్వహించినట్లు డాక్టర్ సురేందర్ తెలిపారు. రైతులు పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి యమున, సహాయకులు ఏఎల్ఎస్ శివల పాల్గొన్నారు.

## మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి


నకిరేకల్: మహాసభల కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఐద్వా నాయకురాలు

నకిరేకల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. నకిరేకల్‌లో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు మహిళా సంక్షేమం కోసం ఐద్వా నిరంతరం కృషి చేస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సరైన న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి, పట్టణ అధ్యక్షురాలు పన్నాల శశికళ, పద్మ, విజయ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మాయ మాటలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్


ఐకేపీ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పోసిన ధాన్యం రాశులను పరిశీలించారు. పంట కోసి ఎన్నిరోజులైంది.. ధాన్యం కొంటున్నారా.. అని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలు, చర్యలతో రాష్ట్రాభివృద్ధి 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మూర్ఖపు విధానాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతికూల పరిస్థితులను అధిగమించి రైతులు పండించిన వానాకాలం ధాన్యాన్ని నేటి వరకూ కొనుగోలు చేసే దిక్కేలేకుండా పోయిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామా మొదలు పెట్టిందన్నారు. 22నెలల కాలం గడుస్తున్నా నేటికీ గ్రామాలకు సర్పంచులు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జె.వెంకటరెడ్డి, నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కె.ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రషీద్, కె.సైదిరెడ్డి, బి.సురేష్ తదితరులు ఉన్నారు.


**కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ**

నకిరేకల్: మండలంలోని చందంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22నెలలు గడిచినప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వంటెపాక సుందర్, చెవుగోని శంకర్, చెరుకు వెంకటాద్రి, పాలడుగు యేసు, కందాళ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉన్న కార్డులను ప్రజలు బీఆర్ఎస్ నేతలు నార్కట్‌పల్లిలో శనివారం పంపిణీ చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గ్యారెంటీల కార్డులను పంపిణీ చేసిందని, వాటిలో ఇంకా నెరవేర్చని పథకాలపై బాకీ కార్డులను పంచుతూ ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మండల యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు పుల్లెంల వెంకట్, నాయకులు ఎండీ వాజిద్, పుల్లెంల మహేష్, నడింపల్లి మహేష్ రాగిరి శివశంకర్, జెట్టి వెంకన్న, ప్రజ్ఞాపురం శివ, పగిళ్ల శివశంకర్, ప్రజ్ఞాపురం రాము, అశోక్, ఏషం శ్రీకాంత్, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.


నకిరేకల్: చందంపల్లిలో బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న ప్రసన్నరాజ్

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 22.8
నల్లగొండ
5
ఆదివారం 12 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 590 (312.0450) | 1,00,729 | 1,00,729 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 644.30 (4.28) | 3,031.92 | 2,970.33 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 173.029 (42.7287) | 82,692 | 82,092 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

# ఇంకెన్నాళ్లీ బతుకులు



- దరిచేరని నమస్తే పథకం
- పర్యావరణాన్ని పరిరక్షించడంలో పరోక్ష దోహదం
- వృత్తిగా మారిన చెత్త సేకరణ
- ఆ ఆదాయంతోనే కుటుంబాలను వెల్లదీసుకుంటున్న దీనస్థితి

**ఎన్ని ప్రభుత్వాలు మారినా, రోడ్ల వెంట చెత్త సేకరించే కార్మికులు, సఫాయి కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదు. వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం 2023లో నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్) అనే పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అయితే ఈ పథకం కార్మికుల దరిచేరడం లేదు.**

- (ఆంధ్రజ్యోతి,రామగిరి)

నమస్తే పథకాన్ని కేంద్ర సామాజిక న్యాయం, అధికార పరిరక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ అమలు చేస్తోంది. 2023లో ప్రారంభమైనప్పటికీ 2026 నాటికి పూర్తిస్థాయిలో ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ప్రధానంగా రోడ్ల వెంట చెత్త ఏరుకునేవారికి, సెప్టిక్ ట్యాంకులను, మురుగు కాల్వలను శుభ్రపరిచే వారికి సురక్షితమైన యాంత్రిక పద్ధతులను ప్రోత్సహించడం, ఆయా కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి వారి జీవనోపాధిలో మెరుగుదల కల్పించడం ఈ పథకం లక్ష్యం. అయితే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినా, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారడంతో పాటు, రోడ్ల వెంట చెత్త ఏరుకునే కుటుంబాల పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండటం లేదు. దీంతో వారు రోజువారీగానే చెత్తను సేకరించి వచ్చే అరకొర ఆదాయంతో బతుకీడుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం లక్ష్యం వందశాతం అమలైతేనే వారి జీవన విధానంలో మార్పు రానుంది.

### నమస్తే పథకం ఇలా..

మురుగు నీరు, సెప్టిక్ ట్యాంకు కార్మికులు, రోడ్ల వెంట చెత్త ఏరుకునే వారిని గుర్తించి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా వర్తింపజేయాలి. మెరుగైన జీవనోపాధి కోసం కార్మికులకు ఆయా రంగాల్లో శిక్షణ ఇవ్వాలి. యాంత్రికమైన పరికరాలు అందించాలి. స్వయం సహాయక సంఘాల ద్వారా సబ్సిడీ రుణాలు అందించడం నమస్తే పథకం ప్రధాన ఉద్దేశం.

### పర్యావరణాన్ని పరిరక్షించడంలో ముందంజ

దిగువశ్రేణి కార్మికులు వారి బతుకులు వెల్లదీసుకునేందుకు ప్రధానంగా చెత్త ఏరుకునే వారు ప్రతీ రోజు తెల్లవారుజామునే పట్టణంలోని ప్రధాన రహదారులు, బహిరంగ స్థలాలు, వీధుల్లో తిరుగుతూ చెత్త సేకరిస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ సంచులు, పేపర్లు, ఇతర వస్తువులు సేకరిస్తూ ఆయా ప్రాంతాల్లో కాస్తో కూస్తో శుభ్రపరచడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడంలో పరోక్షంగా దోహదపడుతున్నారు. పొద్దస్తమానం సేకరించిన పాలిథిన్ కవర్లను, ప్లాస్టిక్, సీసాలను విక్రయించి రోజూ రూ.100 నుంచి రూ.150

- మిగతా 8వ పేజీలో...

# తుంగతుర్తికి నేడు సీఎం రేవంత్



దామోదర్‌రెడ్డి సంతాప సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ, సర్వోత్తమ్‌రెడ్డి

### మాజీ మంత్రి ఆర్డీఆర్ సంతాప సభకు హాజరు

తుంగతుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి రానున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఈ నెల ఒకటో తేదీన మృతి చెందగా, ఆయన సంతాప సభ మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సంతాప సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేయగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ నరసింహ పరిశీలించారు. ముఖ్యమంత్రి తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు సుమారు 50వేల నుంచి 60వేల మంది వరకు ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్డీవో వేణుమాధవ్, ఆర్డీఆర్ కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రైతు కమిషన్ రాష్ట్ర సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి, పోతు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీఆర్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

దామోదర్‌రెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు అని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఆయనవెంట కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, సునీల్ కుమార్, ఉన్నారు.

# పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

- అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటాం
- ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి

నల్లగొండ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడి ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామని ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి అన్నారు. డీసీసీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా, పార్టీ నాయకులు, కార్యకర్త మనోభావాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని డీసీసీ అధ్యక్షుడి నియామకం చేస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. డీసీసీ అధ్యక్షుడి నియామకం తర్వాతబ్లాక్, మండల, గ్రామస్థాయి అధ్యక్షుల ఎంపిక నిర్వహిస్తామన్నారు.జిల్లాలో 10 రోజులపాటు పర్యటించి అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనకు అనుగుణంగా, అంకితభావంతో పనిచేసే వారిని, అందరినీ సమన్వయపరిచి పార్టీని ముందుకు నడిపించే వ్యక్తిని ఎంపిక చేస్తామన్నారు. ఏఐసీసీ సెక్రటరీ, జిల్లా పరిశీలకుడు సంపత్‌కుమార్ మాట్లాడుతూ, దేశ చరిత్రలో మొట్టమొదటగా కాంగ్రెస్ ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇంట్లో కూర్చుని అభ్యర్థిని ఎంపిక చేస్తుందని, బీజేపీలో అమిత్‌షా కనుసైగలతో అభ్యర్థుల ఎంపిక జరుగుతోందన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 33 జిల్లాల డీసీసీ అధ్యక్షుల ఎంపికకు సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలో ఎవరైనా డీసీసీ అధ్యక్ష పదవికోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పార్టీ అధ్యక్షుడి నియామకానికి సహకరించాలన్నారు. విలేకరుల సమావేశంలో సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కాల్వ సుజాత, గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వరాజన్ మహంతి

### డీసీసీ అధ్యక్ష పదవికి పలువురి దరఖాస్తు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రటరీ విశ్వరాజన్ మహంతికి, జిల్లా పరిశీలకుడు సంపత్ కుమార్‌కు పలువురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డికి ఇవ్వాలని నియోజకవర్గ పార్టీ కార్యకర్తలంతా ఏకగ్రీవంగా తీర్మానం చేసి దరఖాస్తు అందజేశారు. అదేవిధంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, నాయకులు, కార్యకర్తలతో కలిసి దరఖాస్తు అందజేశారు. వీరితో పాటు టీపీసీసీ నాయకులు పున్న కైలాష్‌నేత, దయాకర్ కూడా దరఖాస్తు సమర్పించారు.

# ఏ వ్యవస్థతోనూ న్యాయశాఖకు విభేదాల్లేవు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్

భువనగిరి టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏ వ్యవస్థతోనూ న్యాయశాఖకు విభేదాలు లేవని, వ్యక్తిగత ప్రయోజనాలకు చివరి స్థానం ఇస్తూ దేశ ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చే భారత సైన్యం తమకు ఆదర్శమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లాకోర్టు సముదాయానికి ఆయన శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. అన్ని రంగాల మాదిరిగానే న్యాయశాఖకు కూడా పలు సవాళ్లు ఉన్నాయని, అయినప్పటికీ ప్రజల సమానత్వం, గౌరవం, మర్యాద, ప్రాథమిక స్వేచ్ఛను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాజ్యాంగ లక్ష్యాలను, ప్రజల ఆకాంక్షలను న్యాయవ్యవస్థ నెరవేరుస్తున్నదని, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నదని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థలో సిబ్బంది, న్యాయవాదులు కూడా వాటాదారులేనని, వారందరూ నైతిక విలువలు పాటిస్తూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. న్యాయవ్యవస్థ అంతిమ లక్ష్యం దేశాన్ని, రాష్ట్రాన్ని బలంగా ఉంచడమేనన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు మానవ, సాంకేతిక, భౌతిక వనరుల సాయం తప్పనిసరన్నారు. కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం మంచిర్యాల జిల్లా కోర్టుకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్‌సింగ్

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

### బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు

నాగార్జునసాగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాల సెక్రటరీ బి.సైదులు అన్నారు. శనివారం పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా విభాగాల వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన వంటగది, హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు నైపుణ్యంతో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. త్వరలో సాగర్ బీసీ డిగ్రీ కళాశాలను నిడమనూరుకు తరలిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీవో స్వప్న, బీసీ గురుకుల డిగ్రీ కళాశాల, పాఠశాల ప్రిన్సిపాళ్లు మాధవీలత, రవి కుమార్, భాస్కర్‌రెడ్డి, నితీష్, నాగరాజు, వెంకటేష్, సంతోష్, సరిత, రజని, నర్సింహ, అరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు కవి సమ్మేళనం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'విద్యలో అంతరాలు తొలిగిపోయేదెట్లా' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో ఈ కవి సమ్మేళనం ఉంటుందని టీపీఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాధేశ్యాం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు టీపీఎస్వీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'విశ్వభాష తెలుగు' పుస్తకావిష్కరణ

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కవి, రచయిత అంజయ్య రచించిన 'విశ్వభాష తెలుగు' పుస్తకాన్ని విశ్రాంత ఐఏఎస్ అధికారి, కవి, రచయిత విద్యాసాగర్‌రావు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు తెలుగు భాష అంతరించి పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మాతృభాష తెలుగును బతికించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, నేలపట్ల సత్యనారాయణ, షణ్ముఖ, సాయిబాబు, రాజేశ్వరి, లింగయ్య, కొండల్, నాగభూషణం, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన ఖవ్వాలి

- తెల్లవారు జాము వరకు కొనసాగిన కార్యక్రమం



ఖవ్వాలిలో భక్తి గీతాన్ని ఆలపిస్తున్న కళాకారుడు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గుట్టమెట్ల వద్ద నిర్వహించిన ఖవ్వాలి భక్తులను అలరింపజేసింది. హైదరాబాద్‌కు చెందిన అలీజావిద్ వార్సీ కళా బృందం, నాగ్‌పూర్‌కు చెందిన కరిష్మాతాజ్ కళాకారుల బృందం వేర్వేరుగా ఆలపించిన భక్తి పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. లతీఫుల్లా షాఖాద్రిపై చేసిన కీర్తనలు ఆయన గొప్పతనాన్ని చాటి చెప్పాయి. భక్తులు ఖవ్వాలికి అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తి గీతాలకు అనుగుణంగా కొందరు భక్తులు నృత్యాలు చేశారు. సంగీత వాయిద్యాలు ఆకర్షణగా నిలిచాయి. ఖవ్వాలి ఆదివారం తెల్లవారు జాము వరకు కొనసాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఖవ్వాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ముతవల్లులు సయ్యద్ సమీఉల్లాఖాద్రి, గౌస్‌ఉల్లాఖాద్రి, సల్మాన్‌ఖాద్రి, సమద్, ఎస్.ఆర్.ఠాగూర్ జమాల్‌ఖాద్రి, ఉబైద్‌ఖాద్రి, గౌస్ మోహినుద్దీన్, ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఖవ్వాలి కార్యక్రమానికి హాజరైన భక్తులు

## సంగీత విభావరి రేపు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నవ్య కళానికేతన్ ఆధ్వర్యంలో స్వర మాధురి సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి తడకమళ్ల రాంరం గారావు తెలిపారు. రాష్ట్ర రాజధానికి చెందిన శ్రీవాసవీ ఆర్ట్స్‌తో కలిసి హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో రేపు నిర్వహించే కార్యక్రమానికి సినీ, కళారంగ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలుగు, హిందీ చిత్ర గీతాలతో అలరించనున్న కార్యక్రమానికి కళాభిమానులు హాజరుకావాలని కోరారు.

## పాదయాత్రకు సిద్ధం కావాలి

చింతపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ నుంచి శబరిమాలకు ఈ నెల 23న పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు ఇడుకుళ్ల భరత్‌కుమార్ తెలిపారు. శనివారం వెంకటేశ్వరనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అయ్యప్ప మాలధారణ భక్తులు పాదయాత్రలో పాల్గొనడానికి ముందస్తుగా తమ వివరాలను అందించాలన్నారు.

# జోరుగా మట్టి దందా

● అసైన్డ్ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు ● ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమ రవాణా ● మట్టి విక్రయం.. భూముల స్వాహాకు యత్నం





తుమ్మడం శివారులో మట్టిని తోడుతున్న అక్రమార్కులు, టిప్పర్‌లో తరలుతున్న మట్టి

నిడమనూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలంలో మట్టి అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. అసైన్డ్ భూముల్లో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టి కొందరు మట్టిని రవాణాచేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు నిత్యం మట్టిని తరలించి జేబులు దండుకుంటున్నా చర్యలు లేవు. ప్రభుత్వ భూములను కొల్లగొట్టే యత్నాలు జరుగుతున్నప్పటికీ అధికారులకు కనిపించడంలేదు. దీంతో మట్టి అక్రమ రవాణాకు మండలంలో అడ్డూ, అదుపు లేకుండాపోయింది. మండలంలోని తుమ్మడం, ముప్పారం, నిడమనూరు తదితర గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. తుమ్మడం శివారు 840, ముప్పారం శివారు 153, 720, నిడమనూరు శివారు 294 సర్వే నెంబర్లలోని అసైన్డ్ భూములను అడ్డగోలుగా తవ్వి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు.

### రాత్రివేళల్లో జోరుగా దందా

మట్టి రవాణా రాత్రి వేళల్లో జోరుగా జరుగుతుంది. ఇటీవల మట్టి రవాణా చేస్తున్న ఓ టిప్పర్ నిడమనూరులో పోలీస్‌స్టేషన్ ముందే చెడిపోయి ఆగిపోయింది. మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ జోరుగా అక్రమంగా మట్టి వ్యాపారం చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. తుమ్మడం శివారులోని 840 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో జేసీబీలతో తవ్వకాలు చేపట్టి టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. కనీస అనుమతులు కూడా లేకుండా అసైన్డ్ భూమిలో మట్టిని తవ్వడమే కాకుండా ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారు. కొన్నిచోట్ల టిప్పర్లతో మట్టిని ఒకచోట డంప్‌చేసి తర్వాత ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా వివిధ గ్రామాలకు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో కూడా కొందరు మట్టిని డంప్ చేసి విక్రయిస్తున్నారు. మట్టి టిప్పర్లు, ట్రాక్టర్లు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. అసైన్డ్ భూముల్లో మట్టిని తరలించి అక్రమంగా సొమ్ము చేసుకోవడమే కాకుండా తర్వాత ఆ ప్రభుత్వ భూములను స్వాహా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అసైన్డ్ భూములను కబ్జాచేసే ప్రయత్నాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని తుమ్మడం గ్రామస్థులు వాపోతున్నారు. మట్టి అక్రమార్కులకు అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూముల్లో జరుగుతున్న అక్రమ మట్టి రవాణాను అడ్డుకునేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### మట్టి తవ్వకాలపై హైకోర్టులో రిట్

తుమ్మడం రెవెన్యూ శివారులో 840 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారని తహసీల్దార్ కార్యాలయంతోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో మార్తివారిగూడెం గ్రామానికి చెందిన మర్రి వెంకట్‌రెడ్డి అనే హైకోర్టు న్యాయవాది మట్టి తవ్వకాలపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి అక్రమంగా తరలించుకుపోవడమే కాకుండా ఆ భూములను స్వాహాచేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని, అసైన్డ్ భూములను పరిరక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన హైకోర్టు నిడమనూరు తహసీల్దార్‌కు నోటీస్ పంపించి మట్టి తవ్వకాలపై వివరణ అడిగినట్లు తెలిసింది.

### మట్టి తవ్వకాలను నిలిపివేయించాం : తహసీల్దార్

మట్టి అక్రమ రవాణా గురించి స్థానిక తహసీల్దార్ కృష్ణయ్యను వివరణ కోరగా రెండు వారాల క్రితం తుమ్మడం శివారులో 840 సర్వే నెంబర్ అసైన్డ్ భూమిలో మట్టిని ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తున్నార ని తెలిసి నిలిపివేయించామన్నారు. హైకోర్టు నుంచి ఎలాంటి నోటీసు రా లేదు. ఓ వ్యక్తి హైకోర్టులో రిట్ వేయగా వివరణ ఇచ్చామన్నారు. మండలంలో ఎవరైనా మట్టి అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# సా..గుతున్న నిర్మాణ పనులు

● కంకరపరిచి వదిలేసిన కాంట్రాక్టర్లు
● కంకరరోడ్లపై నుంచి వెళ్లలేక అవస్థలు పడుతున్న ప్రజలు



కంకరపరిచి వదిలేసిన వావిల్‌కోల్ నుంచి చారకొండకు వెళ్లే రోడ్డు

డిండి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలోని ప్రధాన రహదారుల నుంచి గ్రామాలు, తండాలను కలుపుతూ నిర్మించతలపెట్టిన లింకు రోడ్ల నిర్మాణ పనులు ఏళ్లు గడిచినా పూర్తికావడంలేదు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు రోడ్లపై కంకరపరిచి వదిలేశారు. కంకరపరిచిన రోడ్లపై నుంచి తమ గ్రామాలకు వెళ్లలేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. మండలంలో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీరోడ్ల నిర్మాణ పనుల్లో కొన్నింటికి శంకుస్థాపనచేసి పనులు మొదలుపెట్టలేదు. మరికొన్ని రోడ్లపై కంకర, డస్టు పరిచి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు.

### మండలంలో చేపట్టిన లింకురోడ్లు

వావిల్‌కోల్ నుంచి వడ్డెరగూడెం, బ్రాహ్మణపల్లి, బ్రహ్మణపల్లితండా మీదుగా చారకొండ బీటీరోడ్డు వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర కంకరపరిచి వదిలేశారు. చెర్కుపల్లి-తవక్లాపూర్ బీటీరోడ్డు నుంచి గదరాలతండా మీదుగా రామాంతపూర్ వరకు, డిండి - దేవరకొండ ప్రధాన రహదారి నుంచి ప్రతాప్‌నగర్ వెళ్లే బీటీరోడ్డు వరకు, డిండి-దేవరకొండ ప్రధాన రహదారి నుంచి రాసియాతండా వరకు, దేవరకొండ ప్రధాన రహదారి నుంచి డాక్యతండాను కలుపుతూ నిర్మించతలపెట్టిన బీటీరోడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వీటితోపాటు ఎల్లారెడ్డి బావినుంచి శాంతిగూడెం మీదుగా కందుకూరు జడ్పీరోడ్డు వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర కంకరపరిచి వదిలేశారు. డి.నెమలిపూర్ నుంచి నిజాంనగర్ మీదుగా చెర్కుపల్లి వరకు, శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి గోనకోలు వరకు శంకుస్థాపన చేసినప్పటికీ రోడ్డు పనులు ప్రారంభంకాలేదు. దీంతోపాటు తవక్లాపూర్ నుంచి నగరదుబ్బతండా వరకు పనులు ప్రారంభంకాలేదు. ఎస్టీఎస్‌డిఎఫ్ నిధులనుంచి చేపట్టిన పనులు మండలంలో అసంపూర్తిగా ఉన్నాయి.

### రోడ్డు పనులు పూర్తి చేయండి



వావిల్‌కోల్ నుంచి చారకొండ రోడ్డు వరకు పనులు పూర్తి చేయాలి. కంకరపరిచి సంవత్సరం గడుస్తున్న పట్టించుకునేవారు లేరు. వర్షాలకు రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. వడ్డెరగూడేనికి చేరుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఒర్సు ముత్యాలు, వడ్డెరగూడెం

### నిధులు లేకనే బీటీ పనులు పూర్తి చేయలేదు

ఎస్టీఎస్‌డీఎఫ్‌లో చేపట్టిన రోడ్ల పనులకు నిధులు విడుదల కాకపోవడంతోనే నిర్మాణ పనులలో జాప్యం జరుగుతుంది. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.15కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎస్టీఎఫ్‌డీఎఫ్ నిధులు విడుదలైన వెంటనే బీటీ నిర్మాణ పనులు చేపడతాం.

సత్యానందం, డీఈ

## ఇక్కట్లు తీరేనా..
# విస్తరణ జరిగేనా ?

● రహదారి నిర్మాణంలో జాప్యం



కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా విస్తరిస్తున్న రోడ్డు

విస్తరణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా పట్టణంలో జరుగుతున్న సాగర్‌రోడ్ విస్తరణ పనులు ఏళ్ల తరబడి సా...గుతున్నాయి. నింపాదిగా జరుగుతున్న ఈ పనుల కారణంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతుండగా, స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా ఈదులగూడ నుంచి రైల్వే లేన్‌వరకు రోడ్డును 100అడుగులకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే విస్తరణకోసం సేకరించే భూముల ధర అధికంగా ఉండటం, ఇళ్లు, దుకాణాలు కోల్పోయే వారినుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రోడ్డు విస్తరణ ప్లాన్‌లో మార్పులుచేశారు. పలు పర్యాయాలు సవరణలు చేసి వీలును బట్టి కొన్ని ప్రాంతాల్లో రోడ్డు విస్తీర్ణాన్ని తగ్గించారు.

### విస్తరణ విభాగాలుగా..

ఈదులగూడ నుంచి తహసీల్దార్ కార్యాలయం, సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి రాజీవ్‌చౌక్, రౌండ్ నుంచి బస్టాండ్, బస్టాండ్ నుంచి రాఘవ థియేటర్, గాంధీ విగ్రహం నుంచి రైల్వేగేటు వరకు విభాగాలుగా విభజించి రోడ్డును విస్తరిస్తున్నారు. పరిస్థితిని బట్టి కొన్నిచోట్ల 86 అడుగులు (అటు 43, ఇటు 43 అడుగులు), మరికొన్నిచోట్ల 88, 90 అడుగులకు విస్తరిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

### కాలం గడుస్తున్నా..

రోడ్డు విస్తరణ పనులకు ఎప్పుడూ ఏదో ఒక అడ్డంకి తగులుతోంది. పట్టణ నడిబొడ్డు నుంచి జాతీయ రహదారి వద్దంటూ స్థానికులనుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రజాప్రతినిధులు, అధికారులు సమీక్షలు నిర్వహించి ఓకే చేశారు. తదనంతరం విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న వారిలో కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించగా, మార్కెట్ విలువకు అనుగుణంగా అధికారులు పరిహారం అందిస్తున్నారు. నష్టం పరిహారం విడతలవారీగా అందిస్తుండగా, మరో రూ.6కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆయా ఆస్తులు వారసత్వ వివాదాలతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరిహారం అందుకునే వారిపై స్పష్టత లేదని, వివాదాలు సర్దుమణిగిన అనంతరం పరిహారం అందజేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

### ముమ్మరంగా విస్తరణ పనులు



రోడ్డు విస్తరణలు ముమ్మరంగా సాగుతున్నాయి. నేషనల్ హైవే అథారిటీ, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తూ పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన యజమానులు నిబంధనల మేరకు పునఃనిర్మాణాలు చేపట్టాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సెట్‌బ్యాక్ తీసుకోవాలి. వాహనాలు రహదారులపై నిలపకుండా పార్కింగ్ కోసం స్థలం కేటాయించుకుని పట్టణాభివృద్ధికి సహకరించాలి.

- గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

# అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో దేవరకొండ మండలం ఇద్దంపల్లి గ్రామం బీఆర్ఎస్‌కు చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్‌లో చేరినవారికి పార్టీ కండువాలు కప్పి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం ప్రాజెక్టులు పూర్తయితే దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్‌రెడ్డి శ్రీలత రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు హరికృష్ణ, ఇద్దంపల్లి గ్రామ కాంగ్రెస్ నేతలు పందుల వెంకటయ్య, ముత్తయ్య, వాసు, సతీష్, స్వామి, నర్సింహ పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లీ బతుకులు!

(5వపేజీ తరువాయి)

సంపాదించి కుటుంబాన్ని వెల్లదీసుకుంటున్నారు. వీరి కుటుంబాల్లో చదువు పెద్దగా లేకపోవడంతో ఈ వృత్తి కొంతమందికి వంశపారపర్యంగా మారింది. కాస్త ఆదాయం అర్జించినవారు మాత్రం ప్లాస్టిక్, ఇనుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. వీరికంటూ ఒక కేంద్ర ప్రభుత్వం పథకం ఉందనే విషయం తెలియనివారు ఎంతోమంది ఉన్నారు. దీంతో ఎలాంటి ప్రభుత్వ పథకాలు వారి దరిచేరక రోజువారీగా సంపాదించే రూ.150తోను కుటుంబాన్ని పోషించుకుంటూ దయనీయ స్థితిలో గడుపుతున్నారు.

### నీలగిరిలో గుర్తించింది 45 మందినే

నల్లగొండ పట్టణంలో 2లక్షలకు పైబడి జనాభా ఉండగా, మునిసిపల్ యంత్రాంగం దిగువశ్రేణి కార్మికులను 2023 నుంచి ఇప్పటి వరకు 45 మందిని మాత్రమే గుర్తించింది. అందులో కేవలం 15 మంది వివరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమస్తే కోసం పొందుపరిచారు. మిగతావారి వివరాలను పొందుపరచాల్సి ఉంది. అయితే ఒక్క నీలగిరి మునిసిపాలిటీలో 200కు పైగానే దిగువ శ్రేణి కార్మికులు ఉన్నట్టు సమాచారం.

### నమస్తే పథకాన్ని అమలు చేస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నమస్తే పథకాన్ని అమలు చేస్తూనే ఉన్నాం. అందులో భాగంగా గత రెండు నెలల క్రితమే కొంతమంది కార్మికులకు పీపీఈ కిట్లు, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు ఇచ్చాం. పట్టణంలో ఈ విధమైన కార్మికులు ఇంకా ఎవరైనా ఉంటే వారిని గుర్తించి నమస్తే పథకాన్ని పక్కాగా అమలు చేస్తాం.

మునిసిపల్ కమిషనర్,
సయ్యద్ ముసాబ్ అహ్మద్

హలో.. ఆంధ్రజ్యోతి (Hello Andhra Jyothi)

మీ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా మాకు తెలియజేయండి.
ఈ కింది ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వండి..
WhatsApp 9985411381

| | | | |
|---|---|---|---|
| మిర్యాలగూడ రూరల్ | 8498853326 | మిర్యాలగూడ అర్బన్ | 9849711782 |
| నాగార్జునసాగర్ | 6300061840 | దేవరకొండ | 9985411402 |
| గుర్రంపోడు | 8464850954 | మిర్యాలగూడ | 9985411042 |
| నిడమనూరు | 9492608256 | పెద్దఅడిశర్లపల్లి | 9440949965 |
| పెద్దవూర | 9963164401 | చింతపల్లి | 9441950290 |
| హాలియా | 9177656620 | డిండి | 9398897933 |
| త్రిపురారం | 9515375401 | నేరేడుగొమ్ము | 9666332124 |
| తిరుమలగిరిసాగర్ | 9866862208 | మాడ్గులపల్లి | 9000340608 |
| మిర్యాలగూడ టౌన్ | 9866192599 | వేములపల్లి | 9052325491 |

# కులాలకతీతంగా బీసీలంతా ఏకం కావాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శనివారం స్థానిక బీసీభవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు అడ్డుకోవడమంటే బీసీల ఎదుగుదలను అడ్డుకోవడమేనన్నారు. బీసీలంతా కులాలకు, పార్టీలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జక్కా నాగేశ్వరరావు, మురళీయాదవ్, సురేష్, సతీష్, నరేష్, రాజశేఖర్, వెంకట్, పురుషోత్తం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● బీసీల అభివృద్ధికి అడ్డుకోవడం సరికాదని బీసీ విద్యార్థి సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలును అడ్డుకునేందుకు నానా కుట్ర పన్నుతున్నారని, ఇకపై అలాంటి వారికి దూరంగా ఉండాలన్నారు.

### 14న తెలంగాణ బంద్ విజయవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి: బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే ఇవ్వడంపై నిరసన వ్యక్తంచేస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్త బంద్ విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఈ నెల 14న బీసీ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె సత్యనారాయణగౌడ్, గిరి, వెంకటయ్యగౌడ్, వెంకటచారి, లింగయ్య యాదవ్, ఈదయ్యగౌడ్, యాదయ్య గౌడ్, రాములుగౌడ్, రాములు పాల్గొన్నారు.

### బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

చందంపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పేరుతో బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్ఎస్ నేత, సర్పంచ్‌లఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జర్పుల లోక్యానాయక్ అన్నారు. శనివారం చందంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతుబంధు, కళ్యాణలక్ష్మీతోపాటు తులం బంగారం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, వృద్ధుల పింఛన్ల పెంపు పథకాలతో అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని కూడా నెరవేర్చడంలో విఫలమైందన్నారు. 42శాతం రిజర్వేషన్ పెంపు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం లేకుండా ఎలా సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో గోసుల శివ, జబ్బు శ్రీశైలం పాల్గొన్నారు.

చింతపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాజకీయం చేయడం సరికాదని బీసీ సంఘం జిల్లానేత బాదేపల్లి పులిరాజ్‌గౌడ్ అన్నారు. శనివారం చింతపల్లి మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

# దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

● మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



అయ్యప్పస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న రవీంద్రకుమార్

దేవరకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి సేవా సదన్ ప్రారంభించి నిర్వాహకులతో కలిసి పూజలు చేసి మాట్లాడారు. ప్రతీఒక్కరు అధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అయ్యప్పస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళిస్వామి, శ్రీనివాస్ స్వామి, పగిడిమర్రి సతీష్, చింతపల్లి సుభాష్‌గౌడ్, సత్యనారాయణ, సతీష్, ఆలయకమిటి నిర్వాహకులు పాల్గొన్నారు.


### బీఆర్ఎస్‌లో చేరిక

డిండి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసి గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డితో ప్రజలపక్షాన నిలదీసి కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే అన్నారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. పథకాల అమలు తక్కువ, ప్రచార ఆర్భాటమే ఎక్కువన్నారు. కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలు ఆందోళన బాటపట్టాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజాపాలన అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన హస్తం పార్టీ నేతలు తెలంగాణలో సమస్యలు చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారన్నారు. సుమారు 100మంది వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో కడారి దేవయ్య యాదవ్, మాజీ సర్పంచ్ పర్వతాలు, పేట వెంకటయ్య, గోలి శ్రీనివాస రెడ్డి, యాసాని భూపతిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో రాజీనేని వెంకటేశ్వరరావు, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, దొంతినేని యాదగిరిరావు, గంజి సురేష్ పాల్గొన్నారు.

## సుందరంగా సుందరయ్య పార్క్

మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు సుందరయ్య పార్కును మరింత సుందరంగా చేశారు. వర్షాకాల నేపథ్యంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించిన మునిసిపల్ సిబ్బంది, చెట్లను సవరించారు. పార్కులో చిన్నారుల ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన బొమ్మలకు రంగులు వేయించడంతో సందర్శకులకు అకర్షణీయంగా కనిపిస్తున్నాయి. కత్తిరించిన చెట్లతో జంతువులు, కళారూపాలు కనవిందు చేస్తున్నాయి. నీటితో నిండిన కొలను, నీళ్లు చిందిస్తూ కనిపిస్తున్న ఫౌంటైన్లతో సుందరయ్య పార్కు కొత్తదనాన్ని సంతరించుకుంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)




పార్కును అందంగా ముస్తాబు చేసిన నిర్వాహకులు